సాక్షి ప్రకాశం

సోమవారం । 16 । సెప్టెంబర్ । 2024



దారిపేరుతో మూకుమ్మడి దాడి

పుల్లలచెరువు మండలం మర్రివేములలో పొలం దారి వంకతో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై జనసేన కార్యకర్తలు 50 మంది మూకుమ్మడి దాడి చేశారు. - 8లో..



వినాయకా మన్నించు

పోలీసుల ఓవరాక్షన్‌తో పొన్నలూరు మండలం చౌటపాలెంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. శాంతిభద్రతల సమస్య అంటూ వినాయక నిమజ్జనాన్ని అడ్డుకున్నారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
36.5/27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల చిరుజల్లులు పడవచ్చు. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ముస్లింలకు మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు

- మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



సింగరాయకొండ: జిల్లాలోని ముస్లింలకు సోమవారం మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలు దైవంగా ప్రార్థించే మహమ్మద్ ప్రవక్త పుట్టుక సందర్భంగా ఈ పండుగ జరుపుకుంటారన్నారు. కరుణ, దయ, ప్రేమ, న్యాయం వంటి పవిత్ర వచనాలతో కూడిన ఈ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకుని సుఖశాంతులతో మెలగాలని ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు.

మార్కాపురం, కనిగిరి డీఎస్పీల నియామకం



మార్కాపురం డీఎస్పీ నాగరాజు

ఒంగోలు టౌన్: మార్కాపురం డీఎస్పీగా ఉప్పుటూరి నాగరాజు, కనిగిరి డీఎస్పీగా ఎం.మహేశ్వర రావులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం వీరిద్దరూ వెయిటింగ్‌లో ఉన్నారు. నాగరాజు గతంలో ఒంగోలు డీఎస్పీగా పనిచేశారు. అంతకు ముందు ఆయన ఒంగోలు వన్‌టౌన్ సీఐగా, ఎస్‌బీ డీఎస్పీగా కూడా విధులు నిర్వహించారు.

18న ఎస్‌జీఎఫ్ జూడో క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 14, అండర్ 17 క్రీడాజట్ల ఎంపిక ఈనెల 18న మధ్యాహ్నం రెండు గంటలకు సింగరాయకొండ మండలం పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.వనజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికకు ఉమ్మడి జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్లో ఎంట్రీ చేసుకుని, మాన్యువల్ ఎంట్రీఫాంతో ఎంపికకు హాజరుకావాలని చెప్పారు. 17 సంవత్సరాల కేటగిరీలో పాల్గొనదలచిన ఇంటర్ విద్యార్థులు పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు, జ్ఞానభూమి చైల్డ్ ఐడీ నంబర్, సంబంధిత కాలేజీ ప్రిన్సిపాల్ ధ్రువీకరణతో నిర్వాహకులకు సమర్పించాలన్నారు. పూర్తి వివరాలకు పిల్లి హజరత్తయ్య, సెల్ నంబర్ 98486 06573 ను సంప్రదించాలన్నారు.

దారి మారేదేలే..!

- క్రేన్‌తో వినాయకుడి మండపం మీద నుంచి మరో విగ్రహం తరలింపు



వినాయకుడి విగ్రహాన్ని మండపంపై నుంచి కిందకు దించుతున్న దృశ్యం

ఒంగోలు టౌన్: గణేష్ విగ్రహ నిమజ్జనానికి మేము ఏటా ఇదే దారిలో వెళ్తున్నాం.. మరో దారిలో వెళ్లే ప్రసక్తే లేదంటూ రోడ్డు మీద ఏర్పాటు చేసిన మరో వినాయక మండపం మీదగుండా భారీ క్రేన్‌లతో వినాయక విగ్రహాన్ని తరలించిన ఘటన ఒంగోలులో ఆదివారం జరిగింది. నగరంలోని గోపాల్‌నగర్ 5వ వీధిలో కొంత మంది భక్తులు వినాయక మండపం ఏర్పాటు చేసుకున్నారు. అదేవిధంగా గోపాల్ నగర్ 4వ వీధిలో మరికొందరు ఇంకో వినాయకుని మండపం ఏర్పాటు చేశారు. 5వ లైను వారు ఏటా 4వ లైను గుండా విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకెళ్లేవారు. ఎప్పటిలానే ఆదివారం వారు ఊరేగింపుగా ఆ వీధిలోకి రావడంతో అక్కడ పెద్ద వినాయక విగ్రహం ఉంచిన మండపం ఉండటంతో ఊరేగింపు ముందుకు సాగలేక ఆగిపోయింది. ఊరేగింపు వెనక్కు వెళ్లకూడదని..తప్పనిసరిగా అదే మార్గంలో వెళ్లాలంటూ 5వ లైను బొమ్మ నిర్వాహకులు పట్టుబట్టారు. చివరకు ఇరు మండపాలకు చెందిన కమిటీ సభ్యులు ఒక అంగీకారానికి వచ్చారు. రోడ్డు మీద ఉన్న వినాయక మండపం మీద నుంచి భారీ క్రేన్‌ల సాయంతో వెనక ఊరేగింపులో ఉన్న వినాయకుడి విగ్రహాన్ని దించారు. ఆ తరువాత ఊరేగింపు కొనసాగించారు. ఎప్పుడు లేనిది ఇలా జరగడంతో నగరంలో చర్చనీయాంశంగా మారింది.



కొత్తపట్నం సముద్ర తీరంలో బారులుతీరిన వినాయక విగ్రహాలు



భక్తజన సంద్రంగా మారిన కొత్తపట్నం సముద్ర తీరం

గంగ ఒడికి గణపయ్య

వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన మండపాలలో నవరాత్రులు పూజలందుకున్న గణనాథులను ఆదివారం నిమజ్జనానికి తరలించారు. ఒంగోలు నగరం, పరిసర గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాలను కొత్తపట్నం సముద్ర తీరానికి తీసుకొచ్చారు. ఈ ఒక్కరోజే 329 విగ్రహాలను నిమజ్జనం చేశారు. మేళతాళాలతో రంగులు చల్లుకుంటూ ఆటపాటలతో ఉత్సాహంగా ఊరేగింపులు నిర్వహించారు. విగ్రహాలతో పాటు వేలాదిగా తరలివచ్చిన భక్తజనంతో కొత్తపట్నం సముద్ర తీరంలో సందడి నెలకొంది.

– సాక్షి, ఒంగోలు



జిల్లా జనసేనలో విభేదాలు రచ్చకెక్కాయి. పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ ఒంటెత్తు పోకడలకు పోతున్నాడని, పార్టీ అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోకుండా టీడీపీ కార్యకర్తలా వ్యవహరిస్తున్నాడని ఆరోపిస్తున్న అసంతృప్తి నాయకులు ఒక్కటయ్యారు. ఏకంగా మీడియా ముందు తమ అసంతృప్తిని, ఆగ్రహాన్ని వెళ్లగక్కారు. జిల్లా అధ్యక్షుడిని మార్చితేనే జనసేనకు మనుగడ అని తేల్చి చెప్పారు.

గ్లాసులో గలాటా

- జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ ఒంటెత్తు పోకడలపై మండిపడిన జనసైనికులు
- జనసేన పార్టీని టీడీపీకి తాకట్టు పెట్టారని విమర్శలు
- రియాజ్ తప్పుడు నివేదికల వల్లే గిద్దలూరు, దర్శి నియోజకవర్గాల్లో పోటీ చేయలేకపోయామని ఆవేదన
- జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు జనసేన శ్రేణులకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆక్రోశం
- ఒంగోలులో అసంతృప్త నాయకుల సమావేశంతో బయటపడిన విభేదాలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

జిల్లా జనసేన పార్టీలో ముసలం మొదలైంది. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రియాజ్‌పై చాలా కాలం నుంచి అసంతృప్తిగా ఉన్న నేతలంతా ఆదివారం ఒంగోలు నగరంలో సమావేశమై మీడియా ముందు గళం విప్పారు. మార్కాపురం, గిద్దలూరు, దర్శి నియోజకవర్గాలకు చెందిన జనసేన సమన్వయకర్తలు, నాయకులు ఈ సమావేశంలో పాల్గొనడం చర్చనీయాంశమైంది. ఈ పరిణామాలు ఎటువైపునకు దారితీస్తాయోనని కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గత ఎన్నికలకు ముందు నుంచే...

జనసేన పార్టీ జిల్లా నాయకుల మధ్య విభేదాలు ఈనాటివి కావు. మొదట ఒంటరిగా కార్యక్రమాలు నిర్వహించిన కొద్దికాలం మినహా టీడీపీతో పొత్తు పెట్టుకున్నప్పటి నుంచి ఆ పార్టీలో రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరు మొదలైంది. రాష్ట్ర అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తున్న రాయపాటి అరుణ, జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్‌ల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా పరిస్థితి తయారైంది. ఇది ఫిర్యాదులు, వ్యక్తిగత విమర్శల నుంచి ఏకంగా భౌతికంగా దాడి చేయడం వరకు వెళ్లింది. టీడీపీ, జనసేన సమన్వయ కమిటీ సమావేశంలో అరుణ చేతిలో మైకు లాక్కొని ఆమెను మాట్లాడకుండా చేయడం, అనేక సార్లు ఆమెను అవమానపరచడం లాంటి ఘటనలు అనేకం జరిగాయి. చివరికి ఒంగోలు మండలంలో పార్టీ కార్యక్రమంలో పాల్గొని తిరిగి వస్తున్న అరుణపై రియాజ్ వర్గీయులు భౌతికదాడికి పాల్పడడంతో విభేదాలు తీవ్రస్థాయికి చేరాయి. ఒక మహిళ అని కూడా చూడకుండా అరుణను వెంటాడి దాడి చేయడం సంచలనం సృష్టించింది. ఈ దాడి విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎన్నికల తరువాత కూర్చొని మాట్లాడుదామని చెప్పి అప్పటికి సర్దుబాటు చేశారు.

ఒక్కసీటు నుంచి కూడా పోటీ చేయకుండా...

గత ఎన్నికల్లో ప్రకాశం జిల్లాలోని ఒంగోలు, మార్కాపురం, గిద్దలూరు, దర్శి నియోజకవర్గాల నుంచి జనసేన పోటీ చేస్తుందని మొదట ప్రచారం జరిగింది. ఆ తరువాత గిద్దలూరు, దర్శి నియోజకవర్గాలను జనసేనకు కేటాయించినట్లు చెప్పుకున్నారు. తరువాత దర్శి స్థానం నుంచి మాత్రమే జనసేన పోటీ చేస్తుందని ప్రచారం చేశారు. చివరకు జిల్లా నుంచి ఒక్క స్థానం నుంచి కూడా జనసేన పోటీ చేయలేదు. పోటీ చేయకుండా చేతులెత్తేశారన్న విమర్శలు వెల్లువెత్తాయి. జనసైనికులు సైతం అసంతృప్తికి గురయ్యారు. గిద్దలూరు నుంచి జనసేన రెబల్‌గా ఆమంచి స్వాములు పోటీ చేయనున్నట్లు ప్రకటించి ఆ తరువాత ఆయన కూడా మిన్నకుండిపోయారు. ఈ పరిణామాలకు కారణం జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ ఇచ్చిన తప్పుడు నివేదికలేనని పార్టీ నాయకుల్లో అసంతృప్తి ఉంది. అయితే ఈ విషయంలో ఇన్నాళ్లు తెరవెనుక విమర్శలతో సరిపెట్టిన జనసేన నాయకులు ఇప్పుడు ఏకంగా మీడియా ముందుకు వచ్చి మాట్లాడడం చర్చనీయాంశమైంది.

రియాజ్‌ను మార్చాల్సిందే..

జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న షేక్ రియాజ్‌ను ఇప్పటికైనా మార్చకపోతే పార్టీ పూర్తిగా దెబ్బతినడం ఖాయమని అసంతృప్తి నేతలు చెబుతున్నారు. ఇటీవల ఒంగోలు కార్పొరేషన్‌కు చెందిన పలువురు కార్పొరేటర్లు టీడీపీ తీర్థం పుచ్చుకోవడం తెలిసిందే. వారిలో ఐదుగురు కార్పొరేటర్లు జనసేనలో చేరేందుకు సిద్ధమయ్యారని, కానీ రియాజ్ వారిని టీడీపీలో చేరేలా ప్రోత్సహించాడని పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అంతేకాకుండా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌తో రాసుకొని పూసుకొని తిరుగుతున్న రియాజ్ సెటిల్‌మెంట్లు చేస్తూ పార్టీకి చెడ్డపేరు తెస్తున్నాడని ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. జనసేన పార్టీ జిల్లాలో ఎదగకుండా ఆయన అడ్డుపుల్లలు వేస్తున్నాడని చెబుతున్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ చేతిలో కీలుబొమ్మగా మారిన ఆయన టీడీపీ నాయకుడిలా వ్యవహరిస్తున్నాడని విమర్శలు గుప్పిస్తున్నారు. రియాజ్‌ను నమ్ముకొని స్థానిక ఎన్నికలకు పోతే పరాభవం తప్పదని, రియాజ్‌ను మార్చాల్సిందేనని పట్టుబడుతున్నారు.

టీడీపీకి అమ్ముడు పోయాడంటూ ఆరోపణలు

వాస్తవానికి గత ఎన్నికల్లో ఒంగోలు, దర్శి, గిద్దలూరు, మార్కాపురం నుంచి పోటీ చేసేందుకు జనసేన నాయకులు సిద్ధమయ్యారు. ఎందుకోగానీ అధినాయకత్వం పెద్దగా పట్టించుకోలేదు. దీనికి కారణం జిల్లా అధ్యక్షుడిగా ఉన్న షేక్ రియాజ్ ఇచ్చిన తప్పుడు నివేదికలే అన్నది ఆయా నియోజకవర్గాల నాయకుల ఆరోపణ. తెలుగుదేశం పార్టీకి అమ్ముడు పోయిన రియాజ్ ఉద్దేశపూర్వకంగానే అధిష్టానాన్ని తప్పుదోవ పట్టించారని వారు వాదిస్తున్నారు. ఒంగోలు నుంచి పోటీ నుంచి స్వయంగా ఆయన తప్పుకోవడమే కాకుండా మిగతా చోట్ల నుంచి కూడా పార్టీ పోటీ చేయకుండా సైంధవుని పాత్ర పోషించాడని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2009 ఎన్నికల్లో గిద్దలూరు నుంచి పోటీ చేసిన ప్రజా రాజ్యం పార్టీ ఎవరి పొత్తు లేకుండానే గెలవడాన్ని వారు గుర్తు చేస్తున్నారు. గత 20 ఏళ్లకు పైగా గిద్దలూరు నుంచి గెలవని టీడీపీ ఇప్పుడు కేవలం వందల ఓట్ల మెజారిటీతో మాత్రమే గట్టెక్కిందని, అదే జనసేన మద్దతు లేకపోతే తప్పకుండా ఓటమిపాలయ్యేదని విశ్లేషిస్తున్నారు.

దర్శిలో ఎంత ప్రయత్నించినా టీడీపీ గెలవలేకపోయిందని, అదేకనుక జనసేన పోటీ చేసి ఉంటే విజయం సాధించి ఉండేదన్న వాదన వినిపిస్తున్నారు. పార్టీ గెలవడానికి అవకాశం ఉన్నా రియాజ్ కట్టప్ప పాత్ర వలన అసలు పోటీ చేయలేని దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు కూడా రియాజ్‌ను కొనసాగిస్తే రానున్న స్థానిక ఎన్నికల్లో కూడా ఇదే దుస్థితి నెలకొంటుందని, చేజేతులా పార్టీ కొంప ముంచుతాడని చెబుతున్నారు.

మీడియాపై మంత్రి డోలా రుసరుస

- కొత్త మెడికల్ కాలేజీల్లో వసతుల్లేవంటూ వ్యాఖ్య
- అందుకే ఎంసీఐ అనుమతులివ్వలేదని బదులు
- వసతులు కల్పించాకే అడ్మిషన్లు చేపడతామన్న మంత్రి



మీడియాపై మండిపడుతున్న మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి

ఒంగోలు: కొత్త మెడికల్ కాలేజీల్లో సీట్ల విషయంపై ప్రశ్నించిన ఓ మీడియా ప్రతినిధిపై మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి రుసరుసలాడారు. ఒంగోలులో ఆదివారం జరిగిన జూనియర్ ఛాంబర్ వారోత్సవాల అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఒక మీడియా ప్రతినిధి మెడికల్ కాలేజీల అంశంపై ప్రశ్నించగా.. మీరేం చదువుకున్నారంటూ ఆయన్ను మంత్రి దబాయించారు. తాను పట్టభద్రుడ్ని అని మీడియా ప్రతినిధి తెలపడంతో కాలేజీ అంటే లెక్చరర్లు, బెంచీలుండాలి, ల్యాబ్‌లు ఉండాలి, ఇవేమీ లేకుండా కాలేజీలు నిర్వహించగలమా అంటూ ఎదురు ప్రశ్నించారు. ఇవేమీ లేవు కనుకే మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) వీటికి అనుమతులివ్వలేదని, తాము మెడికల్ కాలేజీలో ఇటీవల నూతనంగా 346 పోస్టుల భర్తీని కేబినెట్‌లో కూడా ఆమోదించామన్నారు. మెడికల్ కాలేజీలు తాము రద్దుచేయలేదని,కొనసాగిస్తామన్నారు. మార్కాపురం పోదాం రండి.. అక్కడ అన్ని సౌకర్యాలు ఉన్నాయో లేదో చూద్దురుగాని రండి అంటూ చిర్రుబుర్రులాడారు. మెడికల్ కాలేజీల్లో అడ్మిషన్లు ఎప్పుడు మొదలవుతాయని ప్రశ్నిస్తే కాలేజీల్లో వసతుల కల్పన పూర్తయితే అప్పుడు అడ్మిషన్లు ప్రారంభవుతాయన్నారు.

జనసేన ఎవరి జాగీరు కాదు

- జిల్లా జనసేన అధ్యక్షుడు రియాజ్‌ను తొలగించాలి
- ఒంగోలులో సమావేశమైన మార్కాపురం, గిద్దలూరు జనసేన సమన్వయకర్తలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బెల్లంకొండ సాయిబాబు

ఒంగోలు టౌన్: జనసేన పార్టీ ఎవరి జాగీరు కాదని, జిల్లాలో పార్టీని బలోపేతం చేయడానికి జిల్లా అధ్యక్షుడు రియాజ్‌ను తప్పనిసరిగా మార్చాలని గిద్దలూరు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త బెల్లంకొండ సాయిబాబు సూచించారు. ఒంగోలులో లాయరుపేటలో పార్టీ ప్రచార కమిటీ నాయకులు జడా నాగేంద్ర ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ అన్నదానం కార్యక్రమం 60 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన అన్నదానంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీలో ఎలాంటి సమస్యలు తలెత్తినా పరిష్కరించే సమర్థ నాయకత్వం కలిగిన వారు జిల్లా అధ్యక్షుడిగా ఉండాలన్నారు. రియాజ్ కోసం లక్షల రూపాయలు ఖర్చు చేశామని తెలిపారు. తనను రెండు సార్లు రియాజ్ అవమానించారని, అయినా సహనం వహించి పార్టీ కోసం పనిచేస్తూనే ఉన్నామన్నారు. జిల్లాలోని అన్నీ నియోజకవర్గాల్లో కూడా పార్టీ లీడర్‌షిప్ సమర్థవంతంగా లేదని కేడర్ భావిస్తున్నారని, పార్టీని బలోపేతం చేసేందుకు అధిష్టానం చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా నాయకత్వంతో పాటుగా నియోజకవర్గాల నాయకులను కూడా మార్చాలని, జిల్లా అధ్యక్షుడిగా సమర్థుడైన నాయకుడికి బాధ్యతలను అప్పగించాలని ఆయన కోరారు. జిల్లా నుంచి గెలిచిన తెలుగు దేశం పార్టీ ఎమ్మెల్యేలు జనసేన నాయకులను నిర్లక్ష్యం చేస్తున్నారని, వారికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. ఈ విషయంలో జనసైనికుల్లో అసంతృప్తి నెలకొందని, ప్రతి మండలంలో నామినేషన్ పదవులు, ఉద్యోగాల విషయంలో జనసేన కార్యకర్తలకు న్యాయం చేసేందుకు టీడీపీ ఎమ్మెల్యేలు ప్రయత్నించాలని సూచించారు. ఏళ్ల తరబడి పార్టీ కోసం పనిచేసినా ఒక్క నియోజకవర్గం నుంచి కూడా పోటీ చేయలేకపోవడానికి కారణమేమిటో ఆలోచించుకోవాలన్నారు. పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసి పవన్ కళ్యాణ్‌ను ముఖ్యమంత్రిని చేసేందుకు పాటుపడతామని చెప్పారు. జనసేన పార్టీ ఎవరి జాగీరు కాదని జనసేన సెంట్రల్ ఆంధ్ర కన్వీనర్ చీకటి వంశీదీప్ వ్యాఖ్యానించారు. జిల్లాలో రియాజ్ మాత్రమే పనిచేయలేదని, జిల్లా మొత్తం 12 నియోజకవర్గాల నాయకులు కూడా కష్టపడ్డారని, ఈ కష్టానికి ప్రతిఫలం అందరికీ దక్కాలని, మాకు కూడా న్యాయం జరగాలని స్పష్టం చేశారు. లేకపోతే మాక్కావలసింది మేము లాక్కుంటామన్నారు. పార్టీని ప్రక్షాళన చేసేందుకు అధినాయకత్వం ప్రయత్నాలు చేస్తుందని మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనాథ్ చెప్పారు. పార్టీ జిల్లా అధ్యక్షుడి మార్పు అనివార్యం అని తేల్చిచెప్పారు. మూడు నెలలుగా పార్టీలో కొంత స్తబ్దత నెలకొన్న మాట నిజమేనని, ఇది అన్నీ చోట్లా ఉందన్నారు. జనసేన పార్టీ జండా పట్టుకున్న ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూడాలని కోరుకుంటున్నామని జిల్లా ప్రధాన కార్యదర్శి బొటుకు రమేష్ బాబు చెప్పారు.

రాష్ట్రస్థాయి ఖోఖో జట్ల ఎంపిక



ఎంపికైన రాష్ట్ర బాలుర జట్టు

జే.పంగులూరు: జాతీయ, రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈనెల 28 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జార్ఖండ్‌లో జరిగే జాతీయ, రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు సబ్ జూనియర్ విభాగంలో బాలబాలికల జట్ల ఎంపిక పూర్తి చేసినట్లు ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి ఆదివారం తెలిపారు. బాపట్ల జిల్లా పంగులూరులోని మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో రాష్ట్ర బాలబాలికల జట్లు ఎంపిక చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల నుంచి 170 మంది క్రీడాకారులు పాల్గొన్నారని, వారిలో మంచి ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈఎంపికలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చైర్మన్ బాచిన చెంచుగరటయ్య మాట్లాడుతూ అనివార్య కారణాల వలన రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ పోటీలు నిర్వహించలేక పోయినట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు గ్రామస్తుల సహకారంతో పంగులూరులో ఎస్ఆర్ ఖోఖో అకాడమీలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో రాష్ట్ర జట్టు మంచి ప్రతిభ కనబరచాలని ఆయన ఆకాంక్షించారు.

రాష్ట్ర స్థాయి బాలుర జట్టు:

ఏ శ్రీనివాసరావు (ప్రకాశం), పీ వెంటేశ్వర్లు (ప్రకాశం), డీ బాజీవలి (ప్రకాశం), ఎన్ భవాని శంకర్ (కృష్ణ), టీ మిట్టు (విశాఖ), డీ రవి (శ్రీకాకుళం), ఎస్ వీరేంద్ర (ఈస్టు గోదావరి), ఆర్ బాలాజీ (కర్నూలు), వీ సాగర్ (ప్రకాశం), ఎం పవన్ (విజయనగరం), పీ జ్యోతిరామ్ (అనంతపురం), సీహెచ్ నారాయణరెడ్డి (ప్రకాశం), బద్రీనాథ్ (చిత్తూరు), బి రాయన్ పాల్ (గుంటూరు), గౌతం (నెల్లూరు).

రాష్ట్ర బాలికల జట్టు:

ఆర్ సరస్వతి (శ్రీకాకుళం), ఎస్ భానుప్రియ (ప్రకాశం), ఎం ధనలక్ష్మి (విజయనగరం), కే భవాని (నెల్లూరు), వై భవాని (శ్రీకాకుళం), జీ లక్ష్మి (చిత్తూరు), ఆర్ లలిత దేవి (విశాఖపట్నం), కే వైశాలి (ప్రకాశం), డీ యోదిత (కృష్ణ), ఏ స్వప్న (అనంతపురం), వి శిరీషా (కర్నూలు), టీ ప్రియా (ఈస్టు గోదావరి), కే రేణుక (వెస్టు గోదావరి), పీ శివమణి (గుంటూరు), ఎం హర్షిత శ్రీ (కృష్ణ).



మంత్రి చేతగానితనాన్ని మభ్యపరిచేందుకే ఆరోపణలు

మంత్రి సత్యకుమార్ యాదవ్ తన చేతకానితనాన్ని మభ్యపరచుకోవటానికి జగనన్న పై ఆరోపణలు చేయడం సిగ్గుచేటు. పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయటమే టీడీపీ కూటమి ప్రభుత్వ లక్ష్యం. అధికారం చేపట్టినప్పటి నుంచి ఆ ప్రకారమే అడుగులు వేస్తోంది. వైఎస్సార్ 4 మెడికల్ కాలేజీలు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కాలేజీలు మంజూరు చేయించారు. గత సంవత్సరం 5 మెడికల్ కాలేజీలు ప్రారంభమయ్యాయి. మెడికల్ కాలేజీలను ఒక ప్రణాళికా బద్ధంగా ప్రారంభించేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తే కూటమి ప్రభుత్వం జగనన్నకు ఎక్కడ మంచిపేరు వస్తుందోనని మోకాలడ్డుతోంది.

– డాక్టర్ అశోక్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు





మంత్రి వ్యాఖ్యలు బాధ్యతా రాహిత్యం

మెడికల్ కాలేజీలపై మంత్రి సత్యకుమార్ చేసిన వ్యాఖ్యలు బాధ్యతా రాహిత్యం. బాధ్యత కలిగిన పదవిలో ఉండి ఇటువంటి వ్యాఖ్యలు చేయడం దారుణం. వైద్య విద్యను విద్యార్థులకు మరింత చేరువ చేసేందుకు గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కాలేజీలను మంజూరు చేశారు. కానీ కూటమి ప్రభుత్వం ప్రైవేట్ జపం చేస్తూ మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేసేందుకు ప్రయత్నాలు చేయడం దారుణం.

– దద్దాల నారాయణ, వైఎస్సార్ కనిగిరి ఇన్‌చార్జి

మంత్రి సత్యకుమార్ వ్యాఖ్యలు సిగ్గుచేటు



మెడిసిన్ చదివే విద్యార్థులకు మెడికల్ కాలేజీలు నిర్మించి ఆసరాగా ఉండాల్సిన ప్రభుత్వం ఆ దిశగా పని చేయకుండా విస్మరిస్తుంది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో కొత్తగా మెడికల్ కాలేజీలు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. కానీ కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీల అభివృద్ధి చేయకుండా ప్రైవేట్‌పరం చేస్తామంటూ ప్రకటించటం విడ్డూరంగా ఉంది.. జగన్ నువ్వు పాఠాలు చెబుతావా అంటూ మంత్రి సత్య ప్రసాద్ మాట్లాడటం సిగ్గుచేటు. ఆయన మతిభ్రమించి మాట్లాడుతున్నారు.

– ఏలూరి సంజీవరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా విద్యార్థి విభాగం కన్వీనర్



చంద్రబాబు పాలనలో ఒక్క మెడికల్ కాలేజీ రాలేదు



రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు చంద్రగ్రహణం లాగా చంద్రబాబు పట్టాడు. ఎంతో కష్టపడి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వం నుంచి 17 మెడికల్ కాలేజీలకు అనుమతులు తెచ్చి వాటికి నిధులు కేటాయించి నిర్మించారు. బాబు పాలనలో ఒక్క మెడికల్ కాలేజీ కూడా రాలేదు. చంద్రబాబు కొత్త కాలేజీల సీట్లు రద్దు చేయాలని కేంద్రానికి లేఖ రాశారు. పేద, మధ్యతరగతి విద్యార్థులు డాక్టర్లు కావాలని కోరుకోకుండా, నిలువుదోపిడీ చేసే ప్రైవేట్ కాలేజీల బాగుకోరుకోవటం దుర్మార్గమైన పని. వైఎస్ జగన్‌పై మంత్రి సత్యకుమార్ వ్యాఖ్యలు గర్హనీయం.

– దామరాజు క్రాంతి కుమార్, వైఎస్సార్ సీపీ నాయకుడు, ఒంగోలు

వినాయక సెలవిక



వినాయకచవతి ఉత్సవాల్లో భాగంగా 9 రోజుల పాటు పూజలందుకున్న గణనాథుడు కడలి చెంతకు చేరాడు. 9వ రోజు ఆదివారం కావడంతో జిల్లా వ్యాప్తంగా గణనాథుని విగ్రహాలను ఉత్సాహంగా నిమజ్జనానికి తరలించారు. నిమజ్జనోత్సవంలో యువత, మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లాలో కొత్తపట్నం, మడనూరు, ఈతముక్కల, పాకల బీచ్‌లు నిమజ్జనోత్సవంతో కళకళలాడాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

– సాక్షి, ఒంగోలు














తలకు గాయాలైన ఆదినారాయణ



ఎడమ చేయి విరగడంతో తీవ్రగాయాలతో రామయ్య

దారి పేరుతో మూకుమ్మడి దాడి

- వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై జనసేన కార్యకర్తల దాడి
- కర్రలతో వీర విహారం చేసిన జనసేన సైనికులు
- ముగ్గురికి తీవ్రగాయాలు, వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితులు



కర్రలతో దాడి చేస్తున్న జనసేన కార్యకర్తలు

పుల్లలచెరువు: జనసేన కార్యకర్తలు రౌడీమూకల్లా రెచ్చిపోయారు. మండలంలోని మర్రివేముల గ్రామంలో పొలం గట్ల విషయంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై సుమారు 50 మంది జనసేన కార్యకర్తలు దాడిచేసిన సంఘటన ఆదివారం జరిగింది. మర్రివేముల గ్రామానికి చెందిన గాజుల ఆదినారాయణ పొలం గట్ల దగ్గర, పక్కనే ఉన్న జనసేన నాయకుడు గాజుల సీతయ్య తనకు దారి ఉందని రోజూ ఆదినారాయణతో గొడవపడుతుండేవాడు. కానీ అక్కడ దారి నీకు లేదు అని చెబుతున్న ఆదినారాయణకు సీతయ్య నుంచి బెదిరింపులు ఎదురుకావడంతో చేసేది లేక 14 వ తేదీన పుల్లలచెరువు పోలీసుస్టేషన్ లో తన కుమారుడు వెంకటేశ్‌తో కలిసి ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ స్పందించి వచ్చి మాట్లాడతాను అని చెప్పి పంపారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం ఆదినారాయణ కుమారుడు వెంకటేశ్ పొలంలో మిర్చి మొక్కల మధ్యలో ట్రాక్టర్‌తో దున్నే సమయంలో ట్రాక్టర్‌కు సీతయ్య అడ్డురావడంతో అతను ఎందుకు గొడవ చేస్తున్నావని ప్రశ్నించాడు. అప్పటికే తగవుకు సిద్ధంగా ఉన్న సీతయ్య మనుషులు గొడవకు ఎగబడ్డారు. చేసేది లేక ఆదినారాయణ కుటుంబ సభ్యులు గ్రామంలోని ఇంటికి వచ్చారు. ఇదే అదునుగా గ్రామంలోని సుమారు 50 మంది సీతయ్య మనుషులు ఆదినారాయణ కుటుంబ సభ్యులపై దాడి చేసి చావగొట్టారు. దీంతో గాజుల ఆదినారాయణ, రామయ్య ఇద్దరూ స్పృహ తప్పి పడిపోవడంతో వారు చనిపోయారు అనుకుని సీతయ్య మనుషులు అక్కడ నుంచి వెళ్లిపోయారు. బాధితుల కుటుంబ సభ్యులు గ్రామస్తులను పిలుచుకుని వైద్యశాలకు వెళ్తున్న క్రమంలో మళ్లీ దారి కాచి ఇబ్బంది పెట్టారు. పెద్ద మనుషులు వారిని బతిమాలుకుని గాయపడిన వారిని యర్రగొండపాలెం వైద్యశాలకు తరలించారు. ఆదినారాయణకు తలకు, చెవికి గాయాలు కాగా, రామయ్యకు ఎడమ చేయి విరిగింది. గాయపడిన వెంకటేశ్ ప్రస్తుతం కనిపించడం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. గాయపడిన వారిలో రమణ కూడా ఉన్నాడు. దాడి చేసి వారిలో శెట్టి అంజయ్య, నాగశ్రీనివాస్, శ్రీకాంత్, దాసయ్య, గాజుల చెన్నకేశవులతో పాటుమరి కొందరు ఉన్నారని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో 2014 సంవత్సరంలో కూడా టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మర్రివేముల గ్రామానికి చెందిన సుమారు 60 మంది సమీపంలోని గాజులపాలెం ఊరి మీదపడి వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడి చేసి పదుల సంఖ్యలో గాయాలుపాలైన సంఘటన ఇప్పటికీ కేసు కోర్టులో ఉంది. దీనిపై ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రామాల్లో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై టీడీపీ, జనసేన కార్యకర్తలు దాడిచేయడం దారుణమైన విషయం అని తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై ఎస్పీతో మాట్లాడానని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం చేయించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వేటగాళ్ల ఉచ్చుకు వ్యక్తి బలి

- అడవి పందుల కోసం విద్యుత్ తీగల ఏర్పాటు
- ఆ తీగలు తగిలి వ్యక్తి మృతి
- గుట్టుచప్పుడు కాకుండా మృతదేహాన్ని బావిలో పడేసిన వేటగాళ్లు



మృతదేహాన్ని బయటికి తీస్తున్న గ్రామస్తులు

కొండపి (సింగరాయకొండ): అడవి పందులను వేటాడేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని మూగ చింతలలో జరిగింది. ఎస్సై కృష్ణ బాలాజీ తెలియజేసిన వివరాల ప్రకారం మూగ చింతల గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు శనివారం రాత్రి అడవి పందులు వేటాడేందుకు గ్రామ సమీపంలోని ముసి వాగులో విద్యుత్ తీగ ఏర్పాటు చేశారు. అదే గ్రామానికి చెందిన మన్నెం వెంకటేశ్వర్లు (35) అటువైపుగా వెళ్లడంతో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే విద్యుత్ తీగ పెట్టిన వ్యక్తులు తెల్లవారుజామున మూడు గంటల సమయంలో అటు వైపుగా వెళ్లగా వెంకటేశ్వర్లు విద్యుత్ షాక్ తగిలి మృతిచెందినట్లు గమనించి భయంతో మృతదేహాన్ని పక్కనే ఉన్న బావిలో పడేశారు. ఈ మేరకు కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వినాయకా..మన్నించు

- చౌటపాలెంలో వినాయక నిమజ్జనాన్ని నిలిపేసిన పోలీసులు
- పోలీసుల ఓవరాక్షన్‌తో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు
- పొన్నలూరు పోలీస్‌స్టేషన్ ముందు ధర్నాకి దిగిన గ్రామస్తులు
- గ్రామస్తులు, మహిళలపై స్వల్ప లాఠీచార్జి చేసిన పోలీసులు



చౌటపాలెంలో వినాయక నిమజ్జనం జరగకుండా ట్రాక్టర్‌ను అడ్డుకుంటున్న పోలీసులు



పొన్నలూరు పోలీస్ స్టేషన్ ముందు ఓవీ రోడ్డుపై ధర్నా చేస్తున్న మహిళలు, గ్రామస్తులు

పొన్నలూరు: పోలీసుల ఓవరాక్షన్‌తో పొన్నలూరు మండలం చౌటపాలెం గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రశాంతంగా ఉన్న గ్రామంలో శాంతిభద్రతల సమస్య ఉందంటూ గ్రామంలో జరుగుతున్న వినాయక నిమజ్జన ఊరేగింపును నిలిపేసి మంత్రి స్వామి, దామచర్ల సత్య ఆదేశాలంటూ గ్రామస్తులపై తమ జులుం చూపించారు. దీంతో పోలీసుల తీరుతో విస్తుపోయిన గ్రామస్తులు పొన్నలూరు పోలీస్‌స్టేషన్ ముందు ధర్నాకి దిగారు. వివరాలు పరిశీలిస్తే.. చౌటపాలెం గ్రామంలోని రామాలయం సెంటర్ వద్ద వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు వినాయక బొమ్మను ఏర్పాటు చేసుకున్నారు. నిమజ్జన కార్యక్రమంలో భాగంగా శనివారం తమ వినాయక బొమ్మను నిమజ్జనానికి, ఊరేగింపునకు స్థానిక పోలీసుల నుంచి అనుమతులు కూడా తెచ్చుకున్నారు. అయితే గ్రామంలోని టీడీపీ సానుభూతి పరులు తమ వినాయక బొమ్మను శనివారమే నిమజ్జనం చేస్తామని ఎస్సై గిరిబాబుకు చెప్పడంతో పోలీసుల ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులు ఆదివారం సాయంత్రానికి మార్చుకొని మరోసారి పోలీసుల నుంచి అనుమతులు తెచ్చుకున్నారు. ఈ క్రమంలో ఆదివారం వైఎస్సార్ సీపీ సానుభూతిపరుల వినాయక బొమ్మ ఊరేగింపు కార్యక్రమానికి సిద్ధ పడుతుండగా రాజకీయ కక్ష సాధింపులో భాగంగా గ్రామంలోని టీడీపీ నాయకులు మంత్రి స్వామి, దామచర్ల సత్య ఆదేశాలతో ఎస్సై గిరిబాబు తన సిబ్బందితో గ్రామానికి చేరుకొని ట్రాక్టర్‌కు అడ్డు తగిలి నిలిపివేశారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

స్వామి భక్తి చాటుకున్న పోలీసులు...

వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల వినాయక నిమజ్జన ఊరేగింపునకు ఆదివారం అనుమతులు మంజూరు చేసిన పోలీసులు ఎస్సై గిరిబాబు ఆధ్వర్యంలో గ్రామానికి చేరుకొని అడ్డుకున్నారు. మంత్రి స్వామి, దామచర్ల సత్య చెప్పిన విధంగా పోలీసులు వ్యవహరిస్తూ తమ బాధ్యతలు మరిచిపోయి స్వామి భక్తి చాటుతూ గ్రామస్తులు, మహిళలపై తమ ప్రతాపం చూపించారు. తమ వినాయక నిమజ్జన ఊరేగింపునకు అనుమతులు ఇచ్చి మళ్లీ ఎందుకు ఆపుతున్నారో చెప్పాలని ఎంత ప్రాధేయపడినా పోలీసులు కనికరించలేదు. దేవుని నిమజ్జన కార్యక్రమంపై రాజకీయ కక్ష సాధింపులు ఎందుకని, ఏ కారణంతో నిమజ్జనం కార్యక్రమాన్ని ఆపుతున్నారని పోలీసులను ప్రశ్నించినా తమకు ఎస్పీ నుంచి ఆదేశాలు ఉన్నాయని నాలుగు రోజుల తరువాత నిమజ్జనం కార్యక్రమం ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై గిరిబాబు కారణాలు లేని సమాధానం గ్రామస్తులకు చెప్పాడు.

ధర్నాకి దిగిన గ్రామస్తులు, మహిళలు:

వినాయక నిమజ్జనం విషయంలో పోలీసుల అనవసర ఓవరాక్షన్‌తో విసుగు చెందిన గ్రామస్తులు, మహిళలు పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తామని చెప్పడంతో ఎస్సై గిరిబాబు హేళనగా నవ్వుతూ మీకు చేతనైంది చేసుకోండంటూ సమాధానం చెప్పాడు. దీంతో ధర్నా చేయడానికి ట్రాక్టర్లపై వస్తున్న క్రమంలో ఊరు దాటిన తరువాత మర్రిపూడి ఎస్సై రమేష్‌బాబు తన సిబ్బందితో కలిసి వారిని అడ్డగించి ట్రాక్టర్లను నిలిపివేశారు. దీంతో నడుచుకుంటూ వస్తున్న మహిళలు, గ్రామస్తులకు పొన్నలూరు, విప్పగుంట గ్రామస్తులు ట్రాక్టర్లు పంపించారు. దీంతో చౌటపాలెం గ్రామస్తులు పోలీస్‌స్టేషన్ దగ్గరకు చేరకొని రాత్రి 10 గంటల సమయంలో ధర్నాకు దిగారు. సుమారుగా గంట పాటు నిరసనకు దిగి ప్రభుత్వానికి, మంత్రి స్వామికి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో రెండు కిలోమీటర్ల మేర ఓవీ రోడ్డుపై వాహనాలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో ధర్నా వద్దకు చేరుకున్న కొండపి సీఐ సోమశేఖర్ గ్రామస్తులపై దురుసుగా ప్రవర్తించి నెట్టడంతో పాటు స్వల్ప లాఠీఛార్జికి దిగారు. దీంతో గ్రామస్తులు ఒక్కసారిగా ప్రతిఘటిచడంతో పోలీసులు వెనుకకు తగ్గారు. మొత్తంగా తమ వృత్తి బాధ్యతను మరచి అధికార పార్టీ నేతల కక్ష సాధింపుల ఆదేశాలను పోలీసులు అమలు చేస్తుండటంతో ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అశాంతి నెలకొంటుంది.

పొలం విషయంలో కొట్లాట

- నలుగురికి తీవ్ర గాయాలు



ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న అంజమ్మ



తీవ్రంగా గాయపడిన చెన్నకేశవులు

పెద్దారవీడు: పొలం విషయంలో ఇరువర్గాల మధ్య జరిగిన కొట్లాటలో నలుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలో రాజంపల్లి గ్రామం పొలాల్లో ఆదివారం సాయంత్రం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజంపల్లి గ్రామానికి చెందిన వెన్నా లక్ష్మిరెడ్డికి సంబంధించిన పొలం 3.30 ఎకరాలను సుమారు రూ.10 లక్షలకు అదే గ్రామానికి చెందిన కంచర్ల చెన్నకేశవులు కొనుగోలు చేసి అడ్వాన్సు రూ.2 లక్షలు ఇచ్చి ఖరారు రాయించుకున్నారు. అయితే రెవెన్యూ ఆన్‌లైన్‌లో మాత్రం చట్లమిట్ల గ్రామానికి చెందిన తిరుమలరెడ్డి సత్యనారాయణరెడ్డి పేరుతో ఉంది. గతంలో పొలం దగ్గరకు కంచర్ల చెన్నకేశువులు కుమారుడు చరణ్ వెళ్లగా అప్పుడు కూడా గొడవ జరిగింది. దీంతో గ్రామస్తులు, పోలీసులు పంచాయితీ చేశారు. వెన్నా లక్ష్మిరెడ్డి రాసి ఇచ్చిన ఖరారు కాగితం గడువు రావడంతో కంచర్ల చెన్నకేశవులు పొలం రిజిస్టర్ చేయించాలని వత్తిడి తెచ్చారు. అయితే వెన్నా పెద్దవెంగళరెడ్డి కుమారుడు సత్యనారాయణరెడ్డి పేరు ఆన్‌లైన్‌లో ఉందని ఆయన రిజిస్టర్ చేయడానికి రావడం లేదని మాటలు దాటవేస్తూ కాలయాపన చేశారు. అసలు విషయం 40 ఏళ్ల క్రిత తిరుమలరెడ్డి నారాయణరెడ్డి పొలం రాజంపల్లి గ్రామానికి చెందిన వెన్నా పెద్దవెంగళరెడ్డి కొనుగోలు చేసి ఖరారు రాయించుకున్నారు. కానీ నారాయణరెడ్డి దగ్గర నుండి పెద్దవెంగళరెడ్డి రిజిస్టర్ చేయించుకోకుండా ఖరారుతో ఉన్నారు. తిరుమలరెడ్డి నారాయణరెడ్డి కుమారుడు సత్యనారాయణరెడ్డి ఆన్‌లైన్‌లో నాపేరు ఉంది కదా మీరు నా పొలంలో ఎలా సాగు చేస్తావు అని కొంత కాలం నుంచి కంచర్ల చెన్నకేశువులను నిలదీస్తూ పొలంలోకి రానియకుండా చూస్తున్నారు. ఆదివారం పొలం సాగు చేసేందుకు సిద్ధం చేసుకుందామని కంచర్ల చెన్నకేశవులు భార్య అంజమ్మ, తల్లి రాములమ్మలు పనులు చేసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న తిరుమలరెడ్డి సత్యనారాయణరెడ్డి, కుమారుడు నరసింహారెడ్డి, ఏర్వ అల్లూరిరెడ్డిలు గొడవ పడి కొట్లాటకు దిగారు. విషయం చుట్టుపక్కల పొలాల రైతులు కంచర్ల చెన్నకేశవులు, కుమారుడు చరణ్‌లు కలిసి పొలం దగ్గరకు వెళ్లి మాట్లాడుతుండగా మాటా మాట పెరిగి కొట్లాటకు దారి తీసింది. తిరుమలరెడ్డి సత్యనారాయణరెడ్డి, కుమారుడు నరసింహారెడ్డి, ఏర్వ అల్లూరిరెడ్డి కలిసి కంచర్ల చెన్నకేశవులు, భార్య అంజమ్మ, కుమారుడు చరణ్, రాములమ్మలను కర్రలతో దాడి చేసి గాయపరిచారు. కంచర్ల చెన్నకేశవులు తలకు, చేయికి, అంజమ్మ, రాములమ్మలకు చేయి విరిగింది. క్షతగాత్రులను మార్కాపురం వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు.